# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 2, నవంబర్ 2025



# రివిజన్ ప్రక్రియను సమర్ధవంతంగా చేపట్టాలి

**✳ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**నస్పూర్, నవంబర్ 01, ప్రభాతవార్త**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమర్ధవంతంగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారిగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరీలుగా విభజించడం జరిగిందని, కేటగిరీ ఏ లో 1987 కంటే ముందు జన్మించి 2002, 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ బి లో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ సి లో 1987 నుంచి 2002 మధ్యలో జన్మించి 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ డి లో 2002-2007 మధ్యలో జన్మించిన వారిగా విభజించడం జరిగిందని తెలిపారు. మొదట కేటగిరి ఏ జాబితాను బిఎల్ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవడం జరుగుతుందని, ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల ఓటర్లను నిర్ధారించడం జరిగిందని, మిగిలిన 12 లక్షల ఓటర్ల నిర్ధారణ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కేటగిరి సి, క్యాటగిరి డి లలోని ఓటర్లను మిగతా 2లో..





## స్వయం ఉపాధి దిశగా

# యువత ముందుకు రావాలి

**✧ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, నవంబర్ 01, ప్రభాతవార్త**

ప్రభుత్వం అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి అవకాశాలను యువత పూర్తిగా వినియోగించుకోవాలని అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. శనివారం ఆదిలాబాద్‌లోని టిటిడిసి భవనంలో నిర్వహించిన ఇందిరమ్మ సెంట్రింగ్ యూనిట్ ట్రెనింగ్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. శిక్షణ పొందిన యువత నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించుకుని స్వయం ఉపాధి సాధించాలని సూచించారు. నిర్మాణ రంగంలో నైపుణ్యం కలిగిన కార్మికులను తీర్చిదిద్దడంలో ఈ శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కష్టపడి నేర్చుకుంటే ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు తప్పక లభిస్తాయని, జిల్లాలో ఇలాంటి మరిన్ని శిక్షణా కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా మాట్లాడుతూ, శిక్షణ యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తోందని, మహిళలు కూడా ఈ రంగంలో ముందుకు రావాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు కలెక్టర్ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ డిపిఎం, ఎపిఎం, న్యాక్ ఏడి స్వప్న రాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**★ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్**

**ఆసిఫాబాద్, నవంబర్ 1, ప్రభాతవార్త**

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల దృష్ట్యా, ప్రశాంత వాతావరణ పరిస్థితులను సవ్యంగా కొనసాగించడానికి నవంబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ శనివారం తెలిపారు. 30 పోలీస్ యాక్ట్1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి, ఎఎస్పీ, ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, మిగతా 2లో..






# 200 గ్రాముల గంజాయి పట్టివేత

**✶ గంజాయి విక్రేత అరెస్ట్**

**చింతలమానేపల్లి, నవంబర్ 1, ప్రభాతవార్త**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ ఆదేశాల మేరకు, జిల్లాలో గంజాయి సాగు అమ్మకాలపై పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. చింతలమానేపల్లి మండలం రణవెల్లి గ్రామానికి చెందిన దుర్గం చిరంజీవి 40 సం.లు లింగయ్య కుమారుడు మిగతా 2లో..

# ఉద్రిక్తతల మధ్య కొనసాగిన కూల్చివేతలు

## పెట్రోల్ పోసుకొని తండ్రీ, కొడుకుల ఆత్మహత్యాయత్నం

**బెల్లంపల్లి, నవంబర్ 01, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మున్సిపాలిటీ చేపట్టిన రోడ్డు విస్థ రణ పనుల్లో బాగంగా రెండవ రోజు ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న కోళ్ల దుకాణలు, పండ్ల దుకాణలు, టేలాలను జేసీబీ లతో కూల్చివేశారు. ఎండీ గౌస్, అతని కొడుకు ఇమ్రాన్‌లు తమ దుకాణాలు కూల్చవద్దని పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే గమనించిన వన్ టౌన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు అక్కడికి చేరుకొని వారిని నివారించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కొద్ది సేపు ఉద్రిక్తత ఏర్పడటంతో బెల్లంపల్లి ఏఆర్ పోలిస్ హెడ్ క్వార్టర్స్ నుంచి ప్రత్యేక పోలీసులను రప్పించి భారీ పోలీస్ బందోబస్తు మిగతా 2లో..



## వరి ధాన్యం కొనుగోళ్ల గోల్‌మాల్‌లో

# ఒకరి అరెస్ట్

**జైపూర్, నవంబర్ 01, ప్రభాతవార్త**

వరి కొనుగోళ్ళ గోల్‌మాల్ కేసులో శనివారం ఒకరిని అరెస్ట్ చేశారు. శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్ వివరాలు వెల్లడించారు. మండలంలోని నర్సింగాపూర్ మద్దులపల్లి పాడి ప్రొక్యూర్మెంట్ సెంటర్‌లో తప్పుడు లెక్కలతో వరి ధాన్యాన్ని చూపించి సివిల్ సప్లై ఫండ్స్ ఒక కోటి ముప్పైతొమ్మిది లక్షల రూపాయలను కాజేసిన కేసులో మూడవ నిందితుడు అయిన తాటిపల్లి సాయి కుమార్‌ను అతని ఇంటివద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో మిగతా 12 మంది ముద్దయిలు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకోవడం కోసం జైపూర్ ఎస్ఐ శ్రీధర్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# ఉద్రిక్తతల మధ్య కొనసాగిన కూల్చివేతలు



(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. కాగా రోడ్డు విస్తరణ కూల్చివేతలను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ పరిశీలించారు.

## చిరు వ్యాపారస్తుల రాస్తారోకో...

తమ దుకాణాలు కూల్చవద్దని కొందరు చిరు వ్యాపారులు ప్రధాన రహదారిపై రాస్తారోఖో చేశారు. తమకు న్యాయం చేయాలనీ, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. పోలీసులు వారికి నచ్చజెప్పారు. మున్సిపల్ కమిషనర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వ్యాపారస్తులు కూల్చివేతలు ఆపాలంటూ పెట్రోల్ పోసుకొని తండ్రి, కొడుకులు ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చిరు వ్యాపారస్తులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా జీవనోపాధి కోసం షాపులు, షెడ్లను ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. కూల్చివేతలు ఆపాలంటూ తాము హైకోర్టును ఆశ్రయించామని అన్నారు. హైకోర్ట్ ఆర్డర్ ఇచ్చినా మున్సిపల్ అధికారులు కూల్చివేతలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకోవాలని అధికారులను చిరు వ్యాపారులు వేడుకున్నారు. అంతే కాకుండా పట్టణంలో చాలాకాలంగా ఎస్సీ కమ్యూనిటీ హాలు ప్రక్కన ప్రధాన డ్రైన్ ను ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కొందరు వ్యక్తులు కట్టిన ఆక్రమణలనుకూడా జేసీబీలతో మున్సిపల్ సిబ్బంది కూల్చి వేశారు. ప్రధాన కాలువ ప్రక్కన ఉన్న ఆక్రమణలను హైడ్రా నిబంధనల ప్రకారం కూల్చి వేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## రోడ్డు వెడల్పులో నిరాశ్రాయులైన వారికి పునరావాసం...

**- మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్**

బెల్లంపల్లి పట్టణంలో పాలిటిక్స్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి కాంటా చౌరస్తా వరకు రోడ్డు విస్తరణలో భాగంగా నిరాశ్రయులైన వారికి పునరావాస సౌకర్యాలు కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ తెలిపారు. పట్టణ అభివృద్ధి పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా వాహనాల రద్దీ దృష్ట్యా ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం భాగంగా రోడ్డు విస్తరణలో షాపులు, టేలాలు ,తోపుడు బండ్లు, కోళ్ల అమ్మకం దారులను గుర్తించి వారికీ కాంటా ఏరియా లోని సింగరేణి పాత సీఎస్పీ కి చెందిన రెండెకరాల స్థలంలో పునరావాసం కల్పిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ఇక్కడ వారు అమ్మకాలు తాత్కాలికంగా చేసుకునేందుకు తగు సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ఎవరు ఆందోళన చెందవద్దని కమిషనర్ కోరారు. ప్రజలు, వ్యాపారులు, చిరు వ్యాపారులు పట్టణ అభివృద్ధిని ద్రుష్టిలో పెట్టుకొని రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ పట్టణ అభివృద్ధి కి ప్రజలు సహకరించాలని వారు కోరారు.

# రిజిజన్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

కేటగిరి ఏ కు మ్యాపింగ్ చేసే ప్రక్రియను మెరుగుపరచాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ బిఎల్ఓలు, బిఎల్ఓ సూపర్ వైజర్ల ద్వారా కేటగిరి ఏ ఓటరు జాబితాను బిఎల్ఓ యాప్ ద్వారా నిర్ధారించి కేటగిరి సి, డి లను కేటగిరి ఏ కు అనుసంధానం చేయడం జరుగుతుందని, ఈ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండలాధికారి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

(మొదటిపేజీ తరువాయి)

బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. జారీ చేసిన చట్టపరమైన ఆదేశాలను ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ ప్రకారం శిక్షార్హులు అవుతారని సూచించారు.

# 200 గ్రాముల గంజాయి పట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

గంజాయి విక్రయానికి పాల్పడుతున్నాడనే సమాచారంతో పోలీసులు దాడి చేసి, అతన్ని అరెస్ట్ చేశారు.అతని వద్ద నుంచి 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం న్యాయస్థానం ఎదుట ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.పోలీసుల ప్రకారం, చిరంజీవి సులభంగా డబ్బు సంపాదించాలని భావించి, మహారాష్ట్ర నుండి తక్కువ ధరకు గంజాయి తెచ్చి, స్థానిక కూలీలు, విద్యార్థులు, యువకులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు.జిల్లా పోలీసులు హెచ్చరిస్తూ మారకద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి అమ్మకం లేదా సరఫరాలో పాల్గొనే వారిపై ఉక్కుపాదం మోపుతాం. దీనికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని పేర్కొన్నారు. వీరితోపాటు చింతలమానేపల్లి ఎస్సై ఇస్లావత్ నరేష్, సిబ్బంది ఉన్నారు.

# సీఎం వ్యాఖ్యలపై తీవ్ర ఖండన

**- తహసీల్దార్‌కు వినతిపత్రం**

సారంగాపూర్, నవంబర్ 01, ప్రభాతవార్త



మండలంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "పాకిస్తాన్ భారత్‌పై దాడి చేసినా భారత్ ప్రతిస్పందించలేదు" అనే వ్యాఖ్యలు భారత దేశ గౌరవాన్ని అవమానపరిచే విధంగా ఉన్నాయని, సైనికుల త్యాగాలను అపహాస్యం చేసేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నేతలు కలిసి తహసీల్దార్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ వ్యాఖ్యలు దేశ సైన్యాన్ని అవమానపరిచే విధంగా ఉన్నాయని, సీఎం ప్రజల ముందుకు వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్, చారి నాయకులు అయిండ్ల మధు, శేఖర్ గౌడ్, రాథోడ్ శివరాం, గోకుల్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ, "దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన జవాన్ల గౌరవాన్ని కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు బాధాకరం" అని పేర్కొన్నారు.



# గంజాయి మొక్కలు స్వాధీనం

**- నిందితుడు అరెస్ట్**

కెరిమెరి, నవంబర్ 1, ప్రభాతవార్త;

మండలంలోని పద్మావతి గ్రామం అంతాపూర్ గ్రామపంచాయతి పరిధిలో నిషేధిత గంజాయి సాగు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో, జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు, కెరిమెరి ఎస్సై మధుకర్ తన సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించగా పద్మావతి గ్రామానికి చెంది అక్రే విశ్వనాథ్ వద్ద 5 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన మొక్కల అంచనా విలువ సుమారు రూ.50 వేలుగా ఉంటుందని నిందితుడిపై సంబంధిత చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు.జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు హెచ్చరించారు.

# ఆలయ ఏర్పాట్లను పరిశీలించిన డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు

సారంగాపూర్, నవంబర్ 01, ప్రభాతవార్త

నిర్మల్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహా పోచమ్మ అమ్మవారి విగ్రహా పునఃప్రతిష్ఠ మహోత్సవం విజయవంతం కావడానికి భారీ స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్లను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు శనివారం ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సామాజిక సేవకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ, ఈ నెల నవంబర్ 3వ తేదీ సోమవారం నుండి నవంబర్ 7వ తేదీ శుక్రవారం వరకు వేద పండితుల ఆధ్వర్యంలో జరగనున్న పోచమ్మ విగ్రహా పునఃప్రతిష్ఠ మహోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమం విజయవంతం చేయడంలో భాగమైన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. అలాగే ఆయన మాట్లాడుతూ, అమ్మవారి దయతో తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా నిర్మల్ జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాను. అమ్మవారి కృపతో ఈ మహోత్సవం విజయవంతంగా పూర్తవ్వాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, అబ్దుల్ హాది,మండలపార్టీ అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, మండలనాయకులు అయిరనారాయణ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ రాజేశ్వర్,ఆలయ డైరెక్టర్లు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలను చైతన్య పరచడానికే ఎన్ఎస్ఎస్




బోథ్, నవంబర్ 01, ప్రభాతవార్త

బోథ్ మండలం పిప్పల్ దారి గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రత్యేక శీతాకాల శిబిరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి. శంకర్ మాట్లాడుతూ మూఢనమ్మకాలు, పరిసరాల శుభ్రత, డిజిటల్ మోసాలు, గంజాయి వీటి వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలను చైతన్యపరిచే విధంగా విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు బండారి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులను చైతన్యపరిచే ఇలాంటి కార్యక్రమాలు తమ గ్రామంలో చేపట్టినందుకు కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హుస్సేన్, ఆఫీసర్ నగేష్, ఉపాధ్యాయులు, వాలంటరీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సదరం శిబిరాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

**✳ మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య**

నస్పూర్, నవంబర్ 01, ప్రభాతవార్త

దివ్యాంగుల నూతన ధ్రువపత్రాలు, పునరుద్ధరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న సదరం శిబిరాన్ని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, ఆర్. ఎం. ఓ. డా. సుధీర్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 1, 3, 4, 6, 7, 10, 11, 12, 13, 14 తేదీలలో లోకో మోటార్/ఆర్థో, 17, 18 తేదీలలో వినికిడి లోపం సంబంధించి ప్రతిరోజు 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గతంలో మీ సేవ కేంద్రాలలో అక్టోబర్ 20వ తేదీ వరకు నూతనంగా నమోదు చేసుకున్న లోకో మోటార్/ఆర్థో, వినికిడి లోపం అభ్యర్థులు సంబంధిత పత్రాలతో సకాలంలో హాజరు కావాలని తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం బదిలీలలో శిబిరాలను నిర్వహించాలని, క్యాంపు నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్ రాజేష్, డి.పి.ఎం. అన్నాజీ, ఎపిఎం రాజ్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

లక్షెట్టిపేట, నవంబర్ 01, ప్రభాతవార్త

ప్రతి ఒక్క వాహనదారుడు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. లక్షెట్టిపేట పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని కరీంనగర్ చౌరస్తాలో రోడ్డు నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈసందర్భంగా సీఐ రమణమూర్తి మాట్లాడుతూ.. వాహనాలు నడిపే సమయంలో వాహన పత్రాలు ఆర్‌సితో పాటు ఇన్సూరెన్స్ పొల్యూషన్ లైసెన్స్ తప్పకుండా వెంట ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారుడు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే సమయంలో సీట్ బెల్ట్ తప్పకుండా పెట్టుకోవాలన్నారు. వాహనాలను వేగంగా నడపకూడదని ఆటో డ్రైవర్లు పరిమితికి మించి వాహనాల్లో ప్యాసింజర్లను ఎక్కించుకోకూడదని ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై సురేష్, ఎస్సై 2 రామయ్యతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజశేఖర్

## పులిమడుగులో రోడ్డు భద్రతా అవగాహన సదస్సు

రామకృష్ణాపూర్, నవంబర్ 01, ప్రభాతవార్త

పులిమడుగు గ్రామంలో రామకృష్ణాపూర్ పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై రాజశేఖర్ ప్రజలకు ట్రాఫిక్ నియమాల ప్రాధాన్యత వివరించి, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. యువకులు, వాహనదారులతో కలిసి రోడ్డు భద్రత కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు.



## విశిష్ట సేవా పురస్కార అవార్డులు

సారంగాపూర్, నవంబర్ 01, ప్రభాతవార్త

నిర్మల్ జిల్లాలోని గ్రామీణ, పట్టణ, కళకారులను ప్రోత్సహించాలని. పాటే మా ప్రాణం అనే సంగీత ఆకాడమి నిర్మల్ వాళ్లు నిర్వహించిన సంగీత అకాడమీ పోటీలలో ఈరోజు లైన్స్ క్లబ్‌లో విశిష్ట సేవా పురస్కారాల అవార్డులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు పాటే మా ప్రాణం అకాడమీ చైర్మన్ కృష్ణంరాజు ముఖ్యఅతిథిగా లేబర్ కమిషనర్ ముత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సేవా పురస్కార అవార్డులు ఇవ్వడం జరిగింది. సారంగాపూర్ మండలానికి చెందిన సాయన్నకు విశిష్ట సేవా పురస్కారం అవార్డు కృష్ణంరాజు ముత్యంరెడ్డి లైన్స్ క్లబ్ చైర్మన్ చేతుల మీదుగా శాలువా కప్పి జ్ఞాపికను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాయన్న మాట్లాడుతు మా అందరి లోని కళనువేలికితిసి ప్రోత్సహించినందుకు ధన్యవాదములు. కళాకారులను ప్రోత్సహించడంలో పాటే మా ప్రాణం అకాడమీ వారు గ్రామీణ, పట్టణ కళాకారులను ఎంతో ప్రోత్సహిస్తున్నారు అని తెలిపారు.

## పిడీఎస్‌యు మహా సభల పోస్టర్‌ల ఆవిష్కరణ

జైపూర్, నవంబర్ 01, ప్రభాతవార్త

డిసెంబర్ 10, 11, 12 తేదీలలో వరంగల్‌లో జరిగే పిడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలను జయప్రదం చేయాలని మండల కేంద్రంలో పిడీఎస్‌యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆహ్వాన సంఘం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిడీఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షుడు పి.సికిందర్, నాయకులు అంజి, పవన్, దుర్గాప్రసాద్, రమ్య, స్వప్న, స్నేహ పాల్గొన్నారు.



## తేమతో సంబంధం లేకుండా పత్తి కొనుగోలు చెయ్యాలి

**- కొలాం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిడం భీంరావ్**

కెరమెరి, నవంబర్ 1, ప్రభాతవార్త:

తేమతో సంబంధం లేకుండా పత్తి కొనుగోలు చేయాలని కొలాం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిడం భీంరావ్ అన్నారు. శనివారం మండల కేంద్రం లో విలేకరుల సమావేశం మాట్లాడుతూ ఈ ఏడాది అధిక వర్షాలు పడుతున్న సమయంలో తేమ పేరుతో ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు గిట్టుబాటు ధర పెట్టక పోవడం రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఇదే అదును గా ప్రవేటు వ్యాపారులు రైతుల కష్టాలను సొమ్ము చేసుకొని ఇష్టానుసారంగా, తమకు తోచిన విధంగా పత్తి కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తేమ పేరుతో కోత విధించవద్దని తేమతో సంభందం లేకుండా గిట్టుబాటు ధర కల్పిచాలి కోరారుఈ కార్యక్రమంలో వారితో పాటు నాయకులు, మాడవి భరత్ భూషణ్, పంద్రం యశ్వంత్ రావు, అడా ఆనంద్, కుర్సెంగా యాదోరావ్,టెకం భీంరావ్, టెకం భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు



## ఇందిరమ్మ ఇళ్లు, పారిశుద్ధ్య పనులు పరిశీలించిన ఎంపీఓ

సారంగాపూర్, నవంబర్ 01, ప్రభాతవార్త

మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి నఎంపీఓ అజీజ్ ఖాన్ ఇందిరమ్మ ఇళ్లు వాటితో పాటు పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కౌట్ల (బి)లో జరిగిన సమావేశంలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్లకు యూనిఫాం, షూస్, గ్లౌజెస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ ద్వారానే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సుధాకర్ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్, మధు తదితరులు పాల్గొన్నారు.




బావిలో పడిన అడవి పందిని సురక్షితంగా బయటకు తీస్తున్న దృశ్యం

## జనావాసాల్లోకి అడవి పందులు

**బావిలో పడిన అడవి పందిని సరక్షితంగా బయటకు తీసి వదిలేసిన అటవి అధికారులు**

తిర్యాని, నవంబర్1, ప్రభాతవార్త;

తిర్యాని మండల కేంద్రంలో శనివారం అడవి పందుల గుంపు పంటచేనుల నుండి జనావాసాల్లోకి రావడంతో ప్రజలందరూ తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. రోడ్లపైకి ఒకే సారి అడవి పందులు గుంపులు గుంపులుగా రావడంతో ప్రజలు కేకలు వేశారు. కాగా ఫారెస్టు ఎనిమల్ ట్రాకర్ బొజ్జిరావు తన విధులకు వెళ్తుండగా ఒక అడవి పంది వచ్చి అతని ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పరుగెత్తుకెళ్ళి ఫారెస్టు కార్యాలయం సమీపంలోని పెద్ది శ్రావణ్‌కు చెందిన మంచి నీటి బావిలో పడింది. గాయాల పాలైన బొజ్జిరావును తిర్యాని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సలు అందించారు. కాగా ఈ సమాచారం అందుకున్న అటవిశాఖ అధికారులు బావిలో పడిన అడవి పందిని బయటకు తీయడానికి దాదాపు మూడు గంటల పాటు శ్రమించి గ్రామస్థుల సహాయంతో సురక్షితంగా బయటకు తీసి వదిలి వేసినట్లు తిర్యాని అటవిశాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు.



అయ్యప్ప స్వాములతో సయ్యద్ గౌస్, అతని మిత్రులు

## మతసామరస్యాన్ని చాటుకున్న సయ్యద్ గౌస్

కౌటాల, నవంబర్ 01 ప్రభాతవార్త

అయ్యప్ప మాల దారణ చేసిన స్వాములకు మండల కేంద్రంలో ముస్లిం సోదరుడు సయ్యద్ గౌస్ బిక్ష పెట్టి తన మత సామరస్యాన్ని చాటుకున్నాడు. అయ్యప్ప స్వాముల పూజ కార్యక్రమంలో పాల్గొని స్వాములకు బిక్షను అందించాడు. ముస్లిం సోదరుడు అయ్యప్ప భక్తులకు భిక్ష అందించడం పట్ల గౌస్ ను పలువురు అభినందించారు. గౌస్ గత 20 సంవత్సరాలుగా మండల కేంద్రంలో ఎలక్ట్రిషన్ గా పనిచేస్తున్నాడు. ఈ బిక్షలో గురుస్వాములు రవి గురుస్వామి, శ్రీనివాస్ గురుస్వామి, సురేష్ గురుస్వామి, మాల ధరించిన స్వాములు, హెచ్.పీ గ్యాస్ డీలర్ దుర్గం జానకిరావ్ లు ఉన్నారు.



ఎరువుల దుకాణంలో మందులను పరిలీస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

## ప్రతి ఒక్కరు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

### - జిల్లా వ్యవసాయాధికారి వెంకట

దహెగాం, నవంబర్ 01,ప్రభాతవార్త :

మండల రైతులు ప్రతి ఒక్కరికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటి అన్నారు. శనివారం మండలంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించరు. ఎరువులను, స్ప్రే మందులను ఎక్కువ ధరలకు విక్రంచకుండా రైతులకు అందుబాటులో ధరలలో అమ్మాలన్నారు. లగ్గం గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్న స్థలాన్ని పరిశీలించి సొసైటీ వాళ్లకు పలు సూచనలు చేసారు. వరి కొనుగోళ్లు త్వరగా ప్రారంభించాలని అన్నారు.పత్తి, వరి సాగు చేసిన రైతులకు ఏ మందులు ఎప్పుడు వాడలో వివరించారు. వరి పంట కోతకు 15 రోజులు సమయం పడుతుందని, పండించే పంటలు మీ క్లస్టర్ లోని వ్యవసాయ విస్తరణ అధికారి సలహాలు సూచనలు పాటించి ఎక్కువ దిగుబడులు పొందాలని, వ్యవసాయ పనిముట్లు కావలసిన రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి కి అప్లికేషన్ ఫారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దహెగాం మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, సిఈవో బక్కయ్య, సాయి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్ అప్పగింత

వాంకిడి,నవంబర్1,ప్రభాతవార్త;

వాంకిడి కమనకు చెందిన కిష్టయ్య ఒప్పో మొబైల్ వాంకిడి మార్కెట్ ఏరియాలో పోవడం వల్ల వాంకిడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాఉ చేయగా పోలీసు వారు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బాధితుడికి




అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా వాంకిడి ఎస్ఐ మహేందర్ మాట్లాడుతూ మొబైల్ పోయిన లేదా దొంగిలించబడిన ప్రతి ఒక్కరూ కూడా త్వరగా స్పందించి సిఈఐఆర్ పోర్టల్ నందు ఫిర్యాదు నమోదు చేస్తే మొబైల్ ట్రేస్ అవ్వడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని తెలియజేశారు. అలాగే ఈ మొబైల్స్ ట్రేస్ చేయుటలో ప్రతిభ కనబర్చిన పోలీస్ కానిస్టేబుల్ నయీమ్ అభినందించినారు.

# విద్యార్థులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలి

### ✻ జిల్లా అదనపు కలెక్టర్, ఇన్‌ఛార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి

ఆసిఫాబాద్, నవంబర్ 1, ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్, ఇన్చార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో మండల విద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, విద్యార్థిని, విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. యు డైస్ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, పాఠశాలలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

## లోక్ అదాలత్‌ను సద్వినియోగపరచుకోవాలి

లక్షెట్టిపేట, నవంబర్ 01, ప్రభాతవార్త

తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, హైద్రాబాద్ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మంచిర్యాల ఆదేశానుసారం లక్షెట్టిపేట పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఈనెల 15న స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి కాసమల్ల సాయికిరణ్ తెలిపారు. రాజీ పడదగ్గ అన్ని క్రిమినల్ కేసులు అలాగే అన్ని రకాల సివిల్ కేసులు,మనీ రికవరీ,యాక్సిడెంట్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మ్యారేజ్ కేసులు లోక్ అదాలత్‌లో రాజీ పడవచ్చు అని వారు పేర్కొన్నారు. మీరందరూ కూడా రాజీ పడాలని కక్షిదారులందరినీ కోరుతున్నట్లు చెప్పారు.అన్ని రకాల సివిల్ కేసుల్లో కూడా సంవత్సరాల తరబడి కోర్టు చుట్టూ తిరిగి మీ విలువైన సమయాన్ని డబ్బులు వృధా చేసుకోవద్దని, ఈ లోక్ అదాలత్లో ఇద్దరు, ఇరుపక్షాలు కలిసి మాట్లాడుకుని సెటిల్ చేసుకుంటే, ఒక్కసారి రాజీ పడిపోయిన తర్వాత కేసు క్లోజ్ అవుతుందన్నారు. దీంతో మీకు డబ్బు, సమయం రెండు కూడా సేవ్ అవుతాయని, అదేవిధంగా మీరు సివిల్ కేసులో కట్టినటువంటి కోర్టు ఫీజు తిరిగి ఇవ్వబడుతుందని చెప్పారు. ఈ నెల 15న జరిగే లోక్ అదాలత్ సందర్భంగా ఈ నెల 3 నుంచి 15 వరకు రాజీపడే కేసులను జూనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ ఆవరణలో పరిష్కరిస్తారు అని తెలిపారు. కావున 03-11-2025 నుంచి 15-11-2025లోపు రాజి చేసుకోగలరు అని కక్షిదారులకు తెలిపారు.




## పాఠశాల వసతులను పరిశీలించిన అధికార బృందం

జైపూర్, నవంబర్01, ప్రభాతవార్త

మండలంలోని ఇందారం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్.హెచ్.వి.ఆర్ అధికార బృందం శనివారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.పాఠశాల పరిసరాలలోని పరిశుభ్రతను పచ్చదనాన్ని, రక్షిత మంచినీటి సౌకర్యలను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థుల క్రమశిక్షణ, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా బృందం అధికారి హమ్మద్ అబ్దుల్ అమీద్ మాట్లాడుతూ స్వచ్ ఏవం హరిత్ విద్యాలయ పురస్కారంలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలకు భౌతిక వసతులకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.జాతీయస్థాయిలో ఉత్తమ స్వచ్ఛ పాఠశాలగా ఎంపికైతే లక్ష రూపాయల నగదు బహుమతిగా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బి. శ్రీనివాస్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయ శాఖ మంత్రికి ఆహ్వానం

సారంగాపూర్, నవంబర్ 01, ప్రభాతవార్త

నిర్మల్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి పోచమ్మ అమ్మవారి పున: ప్రతిష్టాపన మహోత్సవానికి రావాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాదులో మంత్రి ఆఫీసులో శనివారం రోజున మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితో పాటు అడెల్లి ఆలయ కమిటీ చైర్మన్ సింగం భోజ గౌడ్, సారంగాపూర్ మాజీ జెడ్పిటిసి సభ్యులు పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, బోథ్ మాజీ శాసనసభ్యులు రాథోడ్ బాపురావ్ కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అదేవిధంగా కేంద్ర మాజీ మంత్రివర్యులు వేణుగోపాల్ చారికి కూడా ఆహ్వాన పత్రిక అందించినారు. తప్పకుండా రాగలరు కోరినారు. ఈ నెల 03వ తేది నుంచి 07వ తేదీ వరకు వేద పండితుల ఆధ్వర్యంలో అడెల్లి మహా పోచమ్మ విగ్రహం పునః ప్రతిష్ట జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ సభ్యులు, మండల నాయకులు తెలిపారు. అలాగే సారంగాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఉట్ల రాజేశ్వర్,మాల దారస్వాములు గంగాధర్, సాయి కృష్ణ, భూమేష్ తదితరులు ఉన్నారు.



## కాగజ్‌నగర్ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విస్తృత ఉపన్యాసం

### - విజ్ఞాన పరిశోధనకు విద్యార్థులు సిద్ధం కావాలి: డా. శ్రీనివాస్

కాగజ్‌నగర్,నవంబర్ 1,ప్రభాతవార్త

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం విస్తృత ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ కళాశాల వృక్షశాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ పి. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మార్కాంటియా అనే వృక్షజాతి థాలస్ నిర్మాణం, ప్రత్యుత్పత్తి విధానం, జీవన చక్రం గురించి విద్యార్థులకు సవివరంగా వివరించారు. వృక్షశాస్త్రంలో మైక్రో లెవెల్ పరిశోధన ఎంత ముఖ్యమో, ప్రతి విద్యార్థి పరిశీలనా దృష్టితో చదివితేనే సైన్స్ పట్ల ఆసక్తి పెరుగుతుందని తెలిపారు.కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి మాట్లాడుతూ ఇలాంటి విస్తృత ఉపన్యాసాల ద్వారా విద్యార్థుల్లో కొత్త జ్ఞానం పెంపొందుతుందని, ఇతర కళాశాలల అధ్యాపకుల అనుభవం వినడం ద్వారా వారికి కొత్త ఆలోచనలు కలుగుతాయని పేర్కొన్నారు.



# రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలి

## - జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.వి.రమేష్

**ఆసిఫాబాద్, నవంబర్ 1, ప్రభాతవార్త :**

రాజీ మార్గంలో కక్షిదారులు కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.వి.రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీమార్గాన కేసుల పరిష్కారం కోసం ఈ నెల 15వ తేదీన తలపెట్టిన ప్రత్యేక లోక అదాలత్ నిర్వహణపై ఈ నెల 3వ తేదీ సాయంత్రం 5 గంటలకు జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థాన భవనంలో పోలీసు శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రత్యేక లోక అదాలత్ ద్వారా క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, విద్యుత్, బ్యాంకింగ్, భూములు, వివాహ, కుటుంబ కలహాలు, మోటారు వాహనాల ప్రమాదాలు, ఎన్ఐ యాక్ట్, చిట్ ఫండ్స్, చెక్ బౌన్స్, ఇతర కాంపౌండబుల్ కేసులను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రంపై అవగాహన

**కాగజ్‌నగర్, నవంబర్ 1, ప్రభాతవార్త :**



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పి. శ్రీలత

కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రక్తవర్గాలు - జంతువులలో రక్తప్రసరణ వ్యవస్థ తీరు తెన్నులు" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పి. శ్రీలత విద్యార్థులకు వివరణాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి మాట్లాడుతూ, ఇతర కళాశాలలకు చెందిన నిపుణులు పాల్గొనడం ద్వారా విద్యార్థులు విభిన్న అంశాలపై సమగ్రమైన జ్ఞానం పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. లక్ష్మీనరసింహం, జంతుశాస్త్ర విభాగాధిపతి బి. వెంకటేశం, అధ్యాపకులు జనార్ధన్, మల్లికార్జున్, రాజేశ్వర్, శారద తదితరులు పాల్గొన్నారు

# భవన నిర్మాణ కార్మికుల ఇన్సూరెన్స్

## ✳ ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వొద్దు సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్

**తాండూర్, నవంబర్ 1, ప్రభాతవార్త :**


సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్ కుమార్

భవన నిర్మాణ రంగా కార్మికుల ఇన్సూరెన్స్ ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వద్దని సీఐటీయూ మంచిర్యాల్ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. శనివారం భవన నిర్మాణ రంగ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ఇన్సూరెన్స్ రంగ సంస్థలైన క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ.250 కోట్లు, ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ.94 కోట్లు, ట్రెయిల్ బ్లైజర్ అనే బ్రోకర్స్ సంస్థ ద్వారా రూ.346 కోట్లు కట్టబెట్టడం అన్యాయమన్నారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించేలా తీసుకొచ్చిన జీవో 12ను వెంటనే సవరించాలన్నారు. భవన, నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు నుంచే నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. సీఎస్సీ ద్వారా హెల్త్ టెస్టులను చేయించడాన్ని రద్దు చేయాలన్నారు. వెల్ఫేర్ బోర్డు సలహా మండలిని వెంటనే నియమించి, బోర్డు నిధులను కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ మాజీ జిల్లా అధ్యక్షులు సంకె రవి, జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, తాపీ మేస్త్రి కార్మిక సంఘం అధ్యక్షులు కొంకా అశోక్, ఉపాధ్యక్షులు సాలిగామ పోశం, ప్రధాన కార్యదర్శి పూదరి మల్లేష్, నాయకులు వెంకటేశం, పోతరాజుల శంకర్, యశ్వంత్, గజ్జల నారయణ, అసాల అశోక్, మేకల రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపిక

**దహెగాం, నవంబర్ 1, ప్రభాతవార్త :**

దహెగాం మండలంలోని చిన్న రస్పల్లి పియం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటున్న ఎల్కరి కార్తీక్, చాపిలే అంజలి రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం సునీత, పీడీ తోకల రవి తెలిపారు. శనివారం నాడు ఈస్ గాం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 14 జోనల్ స్థాయి ఫుట్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చరని, ఈ నెల 3,4,5 తేదీలలో వికారాబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల పీడీ రవి తెలిపారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు వారిని అభినందించారు.

# సీఎం సహాయనిధి పేదలకు వరం

**వేమనపల్లి, నవంబర్ 01, ప్రభాతవార్త**

చామనపల్లి గ్రామానికి చెందిన గోపేన మల్లక్కకు రూ.35 వేల విలువ గల సీఎం సహాయనిధి చెక్కును శనివారం మాజీ జెడ్పిటిసి ఆర్. సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీతో కలిసి లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని, అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి మాజీ సర్పంచ్ గాలి మధు, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.




జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

# ఘనంగా డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఆసిఫాబాద్, నవంబర్ 1, ప్రభాతవార్త :**

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం కుమురం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టికానంద్, ప్రధాన కార్యదర్శి గోడిసెల కార్తీక్ లు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూభగత్ సింగ్ ఆశయాలతో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డి.వై.ఎఫ్.ఐ) ఏర్పడి నేటికి 46 సంవత్సరాలు గడుస్తున్నదని, ఎందరో అమరుల త్యాగమే భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య పతాకమే నిలువెత్తు గర్వంగా ఎగురుతున్నదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయి తప్ప ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలం అయ్యాయని ఆరోపించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేస్తానని హామీ ఇచ్చినా నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఆత్మకూరి సతీష్, చాపిడి పురుషోత్తం, దుర్గం నిచల్, జిల్లా కమిటీ సభ్యులు చల్లూరి వంశీ, చాపిలే శివ, నాయకులు లచ్చు, చిన్ను, లక్ష్మణ్, కృష్ణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీసీ జేఏసీ చైర్మన్ రమేష్

# బీసీ జేఏసీ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

## - జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ రూప్నర్ రమేష్

**ఆసిఫాబాద్, నవంబర్ 1, ప్రభాతవార్త**

హైదరాబాదులోని బంజారాహిల్స్ కళింగభవన్ లో ఈ నెల 2న జరిగే బీసీ జేఏసీ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆసిఫాబాద్ జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ రూప్నర్ రమేష్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అక్టోబర్ 18న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించినటువంటి బీసీ బంద్ విజయవంతం అయిందని తెలిపారు. ఆదివారం జరిగే సమావేశంలో బీసీలకు రానున్న రోజుల్లో 42 రిజర్వేషన్ సాధించేందుకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. జిల్లా నుండి బీసీ జేఏసీ నాయకులు, కుల సంఘాల, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ ఆవిడపు ప్రణయ్ కుమార్, బీసీ జేఏసీ నాయకులు కోట వెంకన్న, బొట్టుపల్లి ప్రశాంత్, సిరికొండ సాయి కృష్ణ తదితరులు ఉన్నారు

# తండాలో మెరిసిన విద్యా కుసుమం

**బజార్‌హత్నూర్, నవంబర్ 01, ప్రభాతవార్త**




ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని చందు నాయక్ తండాలోని పడ్వాల్ ప్రకాష్ పడ్వాల్ దూర్పత బాయి కుమారుడు పడ్వాల్ ధీరజ్ నీట్‌లో ప్రతిభ కనబరిచి (యంబిబియస్) సీట్ సాధించాడు. గ్రామానికి పేరు తెచ్చిన యువకుడికి గ్రామస్తులు పూల మాలతో ఘన స్వాగతం పలికారు. పడ్వాల్ ధీరాజ్ (యంబిబియస్) సీట్ సాధించిన శుభ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ ధీరజ్‌ను చదివించారు. ధీరజ్ చిన్నప్పటి నుండి చదువులో చురుకుగా ఉండేవాడని గ్రామస్తులు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా సురభి ఇన్స్టిట్యూట్ ఎఫ్ మెడికల్ సైన్స్‌లో చదివి సీటు సంపాదించాడు. కష్టపడి చదివి నందుకు ఫలితం దక్కింది అని కుటుంబ సభ్యులు గ్రామస్తులు అన్నారు.